క్లుప్తంగా

సస్పెన్షన్ ఎత్తివేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: పార్వతీపురం - మన్యం జిల్లా ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని, అలాగే బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాటసమితి నాయకుడు టి. సన్యాసిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కోట వద్ద గల పదో తరగతి స్పాట్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు డి. ఈశ్వరరావు, డి. రాము, డి. శ్యామ్, షేక్ బుకారీబాబు, వి. రామావతారం, కేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



ప్రమాదాలకు నిలయంగా మారిన కుమిలి జంక్షన్

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామం ముఖద్వారం వద్ద అర్అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనాలు మితిమీరిన వేగంతో వస్తుండడంతో ఈ జంక్షన్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రామతీర్థం, విజయనగరం, రెల్లివలస, సీహెచ్ అగ్రహారం గ్రామాల వైపు నుంచి వాహనదారులు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుర్గారావుకు నివాళులు

విజయనగరం ఫూల్‌బాగ్: సామాజిక ఉద్యమకారుడు మలిచర్ల దుర్గారావుకు బీసీ, రజక సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక దాసన్నపేటలో దుర్గారావు దశకర్మ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఆదినారాయణ, టి. భాస్కరరావు, ఎం. నాగభూషణం, ఆర్.రామారావు, టీవీ దుర్గారావు, షణ్ముకరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌బాబుకు సత్కారం



అన్నదాత ఖలీల్‌బాబుకు సత్కారం నిర్వహిస్తున్న సేవకులు

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు 31 రోజుల పాటు అన్నదానం నిర్వహించిన బాబామెట్ట హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్బార్ దర్గా నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబును సేవకులు ఆదివారం రాత్రి గజమాలతో ఘనంగా సత్కరించారు. పేదలకు పట్టెడన్నం పెట్టడంలోనే సంతృప్తి ఉంటుందని, నిరంతరం సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఖలీల్‌బాబు మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు అన్నప్రసాదాన్ని అందించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా కోనేరు గట్టు..



వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దుతున్న కోనేరు గట్టు

డెంకాడ: ముళ్ల పొదలతో నిండి బహిర్భూమిగా వినియోగించే ఆ కోనేరు గట్టు ఇప్పుడు సుందరంగా తయారైంది. డెంకాడ గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న కోనేరు గట్టును చక్కగా తీర్చిదిద్దారు. స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం ఆధ్వర్యంలో రొంగలి సత్యవతి స్వచ్ఛంద సంస్థ పేరిట కోనేరు గట్టును అభివృద్ధి చేశారు. జేసీబీతో చెరవు గట్టుపై పేరుకుపోయిన ముళ్ల పొదలను తొలగించి, గట్టును సరిచేసి వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం మాట్లాడుతూ, కోనేరు గట్టును అభివృద్ధి చేయడం వల్ల గ్రామస్తులు వాకింగ్ చేసుకోవడానికి, సేద దీరడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఆలయాల్లో అక్షయ తృతీయ పూజలు

గజపతినగరం/ వేపాడ : అక్షయ తృతీయ సందర్భంగా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజపతినగరం రామాలయంలో వేంకటేశ్వరస్వామిని అర్చకులు శ్రీనివాసాచార్యులు నరసింహస్వామిగా అలంకరించి భక్తులతో పూజలు,అభిషేకాలు చేయించారు. వేపాడలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఎస్.కోటకు చెందిన తులసి దంపతులు అందజేసిన పట్టువస్త్రాలను ఆలయ ధర్మకర్త రాపర్తి ప్రసాద్ స్వామి వారు, అమ్మవార్లకు అలంకరించారు.

ఆసరాతో భరోసా

- మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం
- మూడు విడతల్లో రూ. 122 కోట్ల రుణమాఫీ
- అభివృద్ధి పథంలో నెల్లిమర్ల నియోజకవర్గ డ్వాక్రా మహిళలు



నెల్లిమర్ల: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారి సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను మాఫీ చేసింది. రుణాలను నిర్ణీత కాలంలో సభ్యులు బ్యాంక్‌లకు చెల్లిస్తే, ఆ డబ్బులను నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటికే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని 5,308 స్వయం సహాయక సంఘాల్లోని 57,600 మంది సభ్యులకు మొత్తం రూ. 163.7 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే రూ. 122 కోట్లు చెల్లించింది. ప్రభుత్వం చెల్లించిన మొత్తాలను వినియోగించుకుని, మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే..

నియోజకవర్గం:	నెల్లిమర్ల
ఆసరా పథకానికి అర్హులైన సంఘాలు:	5,308
సభ్యుల సంఖ్య:	57,600
మాఫీ అయిన రుణ మొత్తం:	రూ 163.7 కోట్లు
మూడు విడతల్లో మంజూరైన మొత్తం:	రూ 122 కోట్లు

నెల్లిమర్ల నియోజకవర్గంలో 5,308 స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ (ఆసరా) పథకానికి అర్హత సాధించాయి. ఈ సంఘాల్లో మొత్తం 57,600 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు వీరు తీసుకున్న రుణాల మొత్తం రూ. 163.7 కోట్లు ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి ఉంది. నెల్లిమర్ల నగరపంచాయతీలో 406 సంఘాల్లోని 4,187 మంది సభ్యులకు రూ. 9.98 కోట్లు, నెల్లిమర్ల మండలంలో 1082 సంఘాల్లోని 11,940 మంది సభ్యులకు రూ. 31.33 కోట్లు, పూసపాటిరేగ మండలంలో 1575 సంఘాల్లోని 17,495 మంది సభ్యులకు రూ. 49.32 కోట్ల మొత్తాలను ప్రభుత్వం మాఫీ చేసింది. అలాగే డెంకాడ మండలంలో 1190 సంఘాల్లోని 12,457 మంది సభ్యులకు రూ. 44.38 కోట్లు, భోగాపురం మండలంలో 1055 సంఘాల్లోని 11,521 మంది సభ్యులకు రూ. 28.69 కోట్లు మాఫీ జరిగింది. రుణమాఫీ మొత్తాన్ని నాలుగు విడతలుగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు 2020 - 21లో మొదటి విడత, 2021-22లో రెండో విడత మొత్తాలను మంజూరు చేసింది. తాజాగా ఈ నెలలో మూడో విడత మొత్తాన్ని మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన రుణమాఫీ మొత్తాలను పెట్టుబడిగా వినియోగించుకుని మహిళలు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. స్వయం ఉపాధి సాధిస్తూ, ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నారు.

కింది ఫోటోలోని మహిళ పేరు గుడ్డాల నారాయణమ్మ. డెంకాడ మండలం పినతాడివాడ గ్రామానికి చెందిన ఈమెకు రూ. 50 వేల రుణ మాఫీ అయ్యింది. రూ. 12,500 చొప్పున ఇప్పటికే మూడే విడతలుగా ప్రభుత్వం ఈమెకు చెల్లించింది. ఆ మొత్తంతో గొర్రెలను కొనుగోలు చేసుకుని, గ్రామంలోనే డెయిరీ ప్రారంభించింది. తద్వారా స్వయం ఉపాధి పొందుతోంది.





పక్క ఫోటోలోని మహిళ పేరు వై.విజయదుర్గ. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామానికి చెందిన మజ్జి గౌరి స్వయం సహాయక సంఘానికి చెందిన ఈమెకు రూ. 48 వేల రుణమాఫీ అయ్యింది. ఇప్పటికే ఆసరా పథకం ద్వారా రూ. 11,830 చొప్పున మూడు విడతల మొత్తాన్ని ప్రభుత్వం ఈమెకు చెల్లించింది. ఆ మొత్తాన్ని వినియోగించుకుని, గ్రామంలో జిరాక్స్, స్టేషనరీ సెంటర్‌ను ప్రారంభించారు. దీంతో ప్రతిరోజూ కొంత ఆదాయం పొందుతోంది.

ఆసరాతో అభివృద్ధి..



ప్రభుత్వం ఆమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. రుణమాఫీ ద్వారా అందజేస్తున్న మొత్తాలతో వ్యాపారాలు, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా ఆసరా మొత్తాలను మహిళలకు అందజేయడం జరిగింది.

-ఎల్. సత్యనారాయణ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతిపథం

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్



పోలిపల్లిలో 'జగనన్నే మా భవిష్యత్..' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: జగనన్న పాలనలో పేద కుటుంబాల్లో వెలుగులతో పాటు రాష్ట్రానికి బంగారు భవిష్యత్ వస్తుందని సర్పంచ్‌లు కర్రోతు వెంకటరమణ, అప్పలభుక్త పైడినాయుడు అన్నారు. మండలంలోని పోలిపల్లి, రావాడ గ్రామాల్లో ఆదివారం 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనపై అవగాహన కల్పించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి వ్యత్యాసం వివరించారు. అనంతరం ఇళ్ల గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ, కర్రోతు శ్రీనివాసరావు, పైడిరాజు, శంకరావు, స్వామినాయుడు, సన్యాసిరావు, చింతపల్లి శంకరరావు, లోలుగు సురేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక దాతల పాత్ర గొప్పది..



పుస్తకదాతలను సత్కరిస్తున్న గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయ ఉద్యమంలో పుస్తక దాతల పాత్ర చాలా గొప్పదని, పుస్తకదాతల సహకారంతోనే కొన్నేళ్లుగా 'పుస్తకహుండీ' కార్యక్రమం జిల్లాలో నిరంతరాయంగా కొనసాగుతోందని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పుస్తకదాతల ఇళ్లకు వెళ్లి సత్కరించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ, సంఘం ఇచ్చిన పిలుపు మేరకు పుస్తకదాతల ఇళ్లకు వెళ్లి ఇప్పటివరకు వేలాది పుస్తకాలను సేకరించి గ్రంథాలయాలకు అందించినట్లు తెలిపారు. అనంతరం కేఎల్‌పురంలోని అబ్దుల్ కలాం గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, కోశాధికారి కొత్తలి ఎర్నాయుడు, అరుణ్, అప్పలనర్సయ్య, బంగారయ్య, జీవీఎల్ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

నెల్లిమర్ల రూరల్: తమకు ఉపాధి హామీ పనులు కల్పించాలని మండలంలోని గుషిణి గ్రామానికి చెందిన దళిత సామాజికవర్గ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ ప్రతినిధి కనిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులను అన్ని వర్గాల ప్రజలకు సమానంగా కల్పించాలన్నారు. గ్రామంలో కొంతమందికే పని కల్పిస్తున్నారని.. దీంతో మిగిలిన వారికి ఉపాధి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వేతనదారులు పార్వతి, సూరయ్య, సత్యవతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై సింహాద్రప్పన్న ఆశీస్సులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అప్పన్న సన్నిధిలో కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: కోరిన కోర్కెలు తీర్చే సింహాద్రి అప్పన్న ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం వరహాలక్ష్మీ నరసింహస్వామిని కోలగట్ల కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఎస్‌వీఎస్ శ్రీనివాస సుజాత గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు దంపతులు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబళ్ల శ్రీరాములనాయుడు దంపతులు, విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యుడు ఎంకేబీ శ్రీను కుటుంబ సభ్యులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్ రజతోత్సవం



అన్నమాచార్య కీర్తనాలపన చేస్తున్న ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీ పైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘ రజతోత్సవ కార్యక్రమాలు సంఘ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మిమ్స్ అర్బన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సాయంత్రం క్లబ్ ఆవరణలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు సారథ్యంలో జరిగిన గీతాలాపన ఆకట్టుకుంది. రాత్రి నిర్వహించిన సభా కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు తామెప్పుడూ ముందుంటామన్నారు.

కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ భేరి రాధికారాణి, వైవీవీ సత్యరనారాయణ, మానాప్రగడ సాహితి, దేవరాజు గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే అధికారం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్‌సీపీ నగర యువజన విభాగ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం సాయంత్రం కోలగట్ల నివాసంలో నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరాగా యువతను ఉద్దేశించి కోలగట్ల మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి...అనేక హామీలిచ్చి వాటిని అమలు చేస్తూ మాట తప్పని నేతగా నిరూపించుకున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శమయ్యాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము ప్రజల వద్దకు వెళ్తున్న సమయంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నామని చెబుతుంటే గర్వంగా ఉందని తెలిపారు. 24 సంవత్సరాల వయసులోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని.. 28 ఏళ్లకే ప్రధాన పార్టీకి పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యానని, తన పనితీరు గుర్తించే ఆ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ఓడినా, గెలిచినా తాను ఎప్పటికీ ప్రజల మనిషినేనని చెప్పారు. పేరుకు ఎమ్మెల్యేని అయినా అందరికి స్వామి అన్నయ్యగానే అభిమానం సంపాదించుకున్నానని తెలిపారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా మీ అన్నయ్యగా వెన్నంటే ఉంటానన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. కార్యకర్తలు, నాయకులే తన బలమని.. వారి అండదండలతో రాజకీయాలు చేస్తున్నానని తెలిపారు. యువజన విభాగం మరింత బలోపేతమై ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అవినీతి, లంచగొండితనం లేని పాలన జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. చేసిన పనికి తాము గొప్పలు చెప్పుకోబోమని, అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. విజయనగరం కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తర్వాత ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. నేడు ప్రధాన కూడళ్లలో చాలామంది సెల్ఫీలు దిగడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధాన కూడళ్ల, పార్కులు అభివృద్ధి చేశామని.. ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా మంచినీటి సమస్య లేదన్నారు. మహిళల కోసమే ప్రత్యేకంగా రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును ఏర్పాటు చేశామన్నారు. విజయనగరానికి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాల తామే తెచ్చామని.. అలాగే జేఎన్‌టీయూ తీసుకు రావడంతో పాటు యూనివర్సిటీగా మార్పు చేశామన్నారు. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, నగర అధ్యక్షుడు అల్లు చాణక్య, రాష్ట్ర కార్యదర్శి జీవీ రంగారావు, జిల్లా యువజన విభాగం నాయకులు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



హాజరైన యువత

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



నీలకంఠాపురంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రేగ సచివాలయం పరిధిలోని రేగ, నీలకంఠాపురం గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని చెప్పారు. ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనుల కోసం ప్రతీ సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లిమాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ రావాడ నీలకంఠం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి యడ్ల కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంగ రమణ, ఆవాల సత్యనారాయణ, శీర తాతబాబు, భూమిరెడ్డి స్వామినాయుడు, బంగారు నాగేశ్, గోకేడ ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మేమున్నాం సభ్యులు

విజయనగరం: నగరంలోని ఎత్తుబ్రిడ్జి డౌన్ (వైజాగ్ రోడ్డులో) వద్ద గల ఆంజనేయ స్వామి గుడి వద్ద మేమున్నాం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలి ప్రతాప్ మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఇటువంటి సమయంలో మేమున్నాం సంస్థ సభ్యులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేమున్నాం.. సభ్యులు మంత్రిప్రగడ రవికుమార్, పద్మ, సూరిబాబు, కంది మూర్తి, కంది లత, రాము, పాపారావు, చిన్నారులు నిఖిల్, జాన్ వెస్లీ, రోహిత్, ఆరాధ్య పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడం వెలకట్టలేని పుణ్యకార్యం

విజయనగరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం వెలకట్టలేని పుణ్యకార్యమని.. స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయుక్తమైన సేవలందించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కర్రోతు సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కామాక్షినగర్ జంక్షన్ వద్ద శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు, త్యాడ చిరంజీవిరావు, కేవీ రమణమూర్తి, ఈపు విజయ్‌కుమార్, పప్పు విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం

నెల్లిమర్ల: పట్టణంలోని పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై పి. నారాయణరావు ఆదివారం ప్రారంభించారు. స్టేషన్‌కు విచ్చేసే సందర్శకులతో పాటు ప్రధాన రహదారిలో ప్రయాణించే వారి దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో..

భోగాపురం: భగవాన్‌సత్యసాయి స్వచ్ఛంద సేవా సమితి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పుడుదొర బస్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ చలివేంద్రాన్ని సేవాసమితి సభ్యులు కాపుగంటి కృష్ణ, అట్టాడ ఆదినారాయణ(సాయిరాం) ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సై నారాయణరావు



భోగాపురం: మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు



విజయనగరం: చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు